


## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపి కడియం కావ్య


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 06 జూన్, 2024 | పేజీలు : 05


# గ్రూపు –1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 9న పరీక్ష
జిల్లాలో 21 కేంద్రాలు,
హాజరుకానున్న 8223 మంది అభ్యర్థులు
పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ పబ్లిక్ మార్గదర్శకల ప్రకారం గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రూపు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై పరీక్షల అబ్జర్వర్లు, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న గ్రూపు ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో 21 కేంద్రాల్లో జరుగనుందన్నారు. ఈ పరీక్షల్లో 8223 అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష నిర్వహణకు ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో టిజిపిఎస్సీ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థులకు తాగునీరు, మరుగుదొడ్డి, ఫర్నిచర్, విద్యుత్ తదితర సౌకర్యాలపై ముందుస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఇ ముఖ్యంగా టిజిపిఎస్సీ ఆదేశాలను అనుగుణంగా పరీక్ష నిర్వహణ రోజు నిర్ణిత సమయంలో పరీక్ష నిర్వహించాలని పరీక్ష పూర్తయ్యేవరకు పరిక్ష కేంద్రాల నుండి ఎవ్వరిని బయటకు పంపటానికి వీలులేదన్నారు. పరీక్ష ముందు అభ్యర్థులను పరీక్ష కేంద్రం మెయిన్ గేట్ వద్ద తనిఖీలు చేయాలని, పరీక్ష హాల్లోకి వెళ్లెటప్పుడు మరోకసారి తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాల్లో తీసుకరాకుండ జాగ్రత్త పడాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద తప్పకుండ సిసికెమెరా ఏర్పాటు చేయాలన్నారు. హాల్ టికెట్‌పై ఫోటోలేకపోయిన ,పేరు తప్పుబడిన అభ్యర్థుల నుండి ఆప్‌డవిట్‌ని తీసుకోవాలన్నరు. పరీక్ష రాసే అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో వారి వివరాలను సరిగ్గా రాశారో లేదో ఇన్విజీలెటర్ల ద్వారా చెక్ చేయించాలన్నారు. అంద దివ్యాంగ అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు సహాయకులుగా ఇంటర్మీడియట్ . లేదా ఆలోపు చదివిన వారికి మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇందూర్ కళాశాల ప్రిన్సిపాల్ విపి రాజు, అడిషనల్ డిసిపి సుభాఉష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల రద్దు




## రాజకీయ, ఆర్థిక సాధికారతకు ఉద్యమిద్దాం

# నైతిక విజయం ఇండియా కూటమిదే



సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి
విజయసారధి

**ప్రజాపక్షం/మహబూబాద్ :** పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన ఇండియా కూటమి మహబూబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన మహబూబాబాద్ పార్లమెంటు ప్రజలందరికీ సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మహబూబాబాద్ సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలరాం నాయక్ గెలుపునకు సిపిఐ శ్రేణులు విశేషంగా కృషిచేసాయన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన ఫలితాల్లో ఇండియా కూటమిదే నైతిక విజయం అన్నారు. 400 సీట్లు వస్తాయన్న బిజెపి కనీసం మ్యాజిక్ ఫిగర్ కూడా చేరుకోలేదన్నారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ వారణాసిలో గత ఎన్నికల్లో 4 లక్షల మెజార్టీతో గెలిచి, ఈ ఎన్నికల్లో కేవలం లక్ష మెజార్టీతో గెలవడం అంటే బిజెపికి ఇది ఘోర ఓటమేనన్నారు. దేశంలో 30 సీట్లలో బిజెపి అత్యల్ప మెజార్టీతో గెలిచిందన్నారు. నైతికంగా ఇండియా కూటమి గెలిచిందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ తమ ఓట్లను బిజెపికి బదలాయించిందన్నారు. రాష్ట్రంలో ఇక బిఆర్ఎస్ శకం ముగిసినట్టేనన్నారు. ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ఛీ కొట్టారన్నారు. రాష్ట్రంలో ఎనిమిది సీట్లు గెలిచిన బిజెపి భుజాలు తరుముకుంటుందని కానీ, బిజెపి, బిఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగా ఆ విజయం వచ్చిందన్నారు. రాబోయే కాలంలో ఇండియా కూటమి అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా బలరాంనాయక్‌ను గెలిపించిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు, మేధావులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు, కార్మికులకు, యువతీ యువకులకు బి.విజయసారథి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, మాలోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ క్లైయిమ్‌లు వెంటనే పరిష్కరించాలి



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్లైయిమ్‌లను పరిష్కరించాలని, వాటికి సంబంధించిన డబ్బులను కార్మికుల అకౌంట్లలో జమ చేయాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ కోరారు.బుధవారం వరంగల్ జిల్లా డిప్యూటి కమిషనర్ ఆఫ్ లేబర్‌కు సుమన్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది కార్మికులు సహజ మరణాలు, ప్రమాదవ శాత్తు మరణాలు, వివాహాలు, డెలివరీకి సంబంధించి దరఖాస్తు చేసుకుని ఉన్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా వారి క్లైయిమ్‌లు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారని అన్నారుఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని, ఎంతో మంది నేటికి రోజూ ఎదురు చూస్తూనే ఉన్నారని, ధమ్ములు రాక ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెట్టడం సరి కాదని ఇప్పటికైనా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్లైయిమ్‌లను పరిష్కరించాలని, వాటికి సంబంధించిన డబ్బులను కార్మికుల అకౌంట్లలో జమ చేయాలని సుమన్ అధికారులను కోరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి

ప్రజాపక్షం, కమలాపూర్ : రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు కృషి చేయాలని కమలాపూర్ సిఐ హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఉప్పల్ నుంచి భీంపల్లికి వెళ్ళే ప్రధాన రహదారి పై ఉన్న ముళ్ళ చెట్లను జెసిబి సహాయంతో తొలగించారు. దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చని ఆయన భావించారు. ప్రమాదాలు జరగడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ట్రాఫిక్ పోలీసులు నియమ, నిబంధనలు పాటిస్తూ వాహనదారులు ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్క రామయ్యకు పరామర్శ



ప్రజాపక్షం / రేగొండ : గోరి కొత్తపల్లి మండలం చిన్న కోడపాక గ్రామంలో సిపిఐ మండల సీనియర్ నాయకులు మార్క రామయ్య సతీమణి మార్క సరోజన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది.కాగా విషయం తెలుసుకున్న సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ బుధవారం వారి స్వగ్రామంలో మార్క రామయ్యకుమారులు సుధాకర్, నరేష్‌ల కుటుంబ సభ్యులను రాజ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరోజన మృతి వారి కుటుంబానికి అట్లాగే పార్టీ కి తీరనిలోటని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల శాంతి కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుంటి చంద్రమౌళి, పప్పుల సారయ్య, గుండు సమ్మయ్య, బండారి లక్ష్మయ్య, బొట్ల చంద్రమౌళి, పంగ రాజయ్య, మద్దెల వీరస్వామి, తడక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వనం వీడి జనంలోకి రండి

ప్రజాపక్షం/మంగపేట : మండలంలో కొంత మంది మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు ప్రజలు వాళ్లకు ఎటువంటి సహాయ సాకారాలు చేయకూడదు వాళ్ళ అఘాయిత్యం వల్ల పేద ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నిషేధిత మావోయిస్టు లు వనం వీడి జనంలో కి వస్తే ప్రభుత్వం ప్రకటించిన రివార్డు లు సంక్షేమ పథకాలు అన్ని అందుకొని ఈ సమాజంలో గౌరవంగా బతకాలని కోరుచు మావోయిస్టు ల సమాచారం తెలిస్తే పోలీస్ శాఖకి సమాచారం ఇవ్వాలని, నిషేధిత మావోయిస్టు ల ఫోటోలతో కూడిన వాల్ పోస్టర్స్‌ను స్థానిక ఎస్ఐ గోదారి రవికుమార్ ఆదేశాల మేరకు గోడలకు అతికించారు.

## చిన్నారులకు నూరుశాతం టీకాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి : అర్హులైన చిన్నారులకు నూటికి నూరుశాతం టీకాలు ఇప్పించి చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడాలని డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. బుధవారం చిన్న పిల్లలకు టీకాలు ఇచ్చే కార్యక్రమం నిర్వహించే రోజు భాగంగా బుధవారం డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగాలపల్లి, రాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో దాదాపుగా 15 మంది పిల్లలకు టీకాలు ఇవ్వడం తనిఖీ చేశారు. దీనితో పాటు ప్రతి ఆశాలకు, ఏఎన్ఎంలకు ముందుగా ప్రతి గర్భిణీ స్త్రీని నమోదు చేసి డెలివరీ అయ్యి నెలన్నర రోజుల వరకు తల్లి పిల్లను చూసుకోవాల్సిన బాధ్యత మన ఆరోగ్య శాఖ సిబ్బందికి ఉందని తెలిపారు. అలాగే ముమ్మందు వర్షాకాలం ప్రారంభం అవబోతున్నందున కాలానుగుణంగా వచ్చే వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశాలకు ఏఎన్ఎంలకు తగు సూచనలు చేశారు. మార్గ మధ్యంలో బావి తీస్తున్న కూలీలు కనబడగా అంది ఒంటి గంట సమయంలో ఆగి ఎండ తీవ్రత దాని వలన వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించడమే కాకుండా వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి ఒక లీటర్ నీళ్లలో ఒక ప్యాకెట్ కలిపి తాగాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, స్టాఫ్ నర్స్ మున్ని, ఏఎన్ఎంలు అల్లం సులోచన, సుజాత, ఆశాలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐటిసి వావ్ ఫీల్డ్ కోఆర్డినేటర్ దోమ పవన్, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనులు అన్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ఐటిసి వావ్, ఈ శ్రీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 59వ డివిజన్ భవానినగర్ కాలనీ నందు కాలనీ కమిటీ సభ్యులతో ర్యాలీ నిర్వహించి కమిటీ హాల్ నందు మొక్కలు నాటారు. అనంతరం కమిటీ హాల్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఐటిసి వావ్ ఫీల్డ్ కోఆర్డినేటర్ దోమ పవన్, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్‌ను వాడకుండా దానికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్స్, జూట్ బ్యాగ్స్ వాడాలని అదేవిధంగా ప్రతి ఒక్కరు మొక్కలని పెంచి వాటిని సంరక్షించాలని, అదే విధంగా చెత్తని రోడ్లపై పడవేయకుండా తడి పొడిగా వేరు చేసి స్వచ్ ఆటో సిబ్బందికి అందజేసి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో భవానినగర్ కాలనీ కమిటీ సభ్యులు నర్సింహామూర్తి, టి దామోదర్‌రెడ్డి, గుడి లక్ష్మారెడ్డి, జె జనార్ధన్‌రావు, శ్రీధర్, సానిటరి ఇన్స్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీను, ఐటిసి వావ్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పవన్, డిఆర్‌సిసి ఆపరేటర్స్, కాలనీ కమిటీ సభ్యులు, సానిటరీ జవాన్లు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



ప్రజాపక్షం/పరకాల : ఇటీవల పార్లమెంట్ ఎన్నికలలో రాష్ట్రంలో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి హన్మకొండ జిల్లా, పరకాల ప్రాంత కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని విజయదుందుభి మోగించేలా చేసిన సీఎంను వారు అభినందించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో చురుకుగా పాల్గొని భారీ మెజారిటి తెచ్చినందుకు కాంగ్రెస్ నాయకులను అభినందించారు. భవిష్యత్‌లో పార్టీ పరంగా తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మాటి సాంబయ్యతో పాటు పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు పర్నెం తిరుపతి రెడ్డి,డిజిటియు రాష్ట్ర అధ్యక్షులు పెండ్యాల కొమురయ్య, లక్ష్మీపురం ఎంపిటిసి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పెంచల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతోనే జీవకోటికి మనుగడ

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : మొక్కలను పెంచడం ద్వారానే జీవకోటికి మనుగడ ఉంటుందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెఫాం సర్వీసెస్ ఫీల్డ్ ఆఫీసర్ దీక్షిత ఆధ్వర్యంలో ఉర్సు పద్మశాలి సంఘం కార్యాలయ ఆవరణంలో కార్పొరేటర్ మరుపల్ల రవి మొక్కలు నాటి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తమ తమ ఇండ్లతో పాటు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించినట్లయితే విరివిరిగా వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెందుతాయని చెట్ల, మొక్కలు నాటి సంరక్షించినప్పుడే మొక్కలు పెరిగి పెద్దగా అవుతాయని అన్నారు. ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై ఫార్మ్ సర్వీసెస్ ఫీల్డ్ ఆఫీసర్ మరుపల్ల దీక్షిత్, కనుకుంట్ల రవి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, గూడూరు రవి, మదుత రామ్, గుల్లపల్లి నాగరాజు, బొప్పతి నరసింహారావు, కనుకుంట్ల స్వరూప, మరుపల్ల రచన, మరుపల్ల ఎల్లేంద్ర, గూడూరు మల్లికాంబ, మరుపల్ల అనూష, మదుత శాంతలక్ష్మి, గూడూరు రాణి, ఆడెపు సరస్వతిలు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రజాపక్షం/నెక్కొండ : కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నెక్కొండ మండలంలోని అన్ని గ్రామాలలో పర్యావరణ పరిరక్షణకై గ్రామ ప్రజలందరికి అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అమృత్ సరోవర్ కుంటలపై మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5వ తేదీ నుండి ఈ నెల 12వ తేదీ వరకు అన్ని గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, ఏపిఓ, ఈసి, సిటిఏ, టిఏ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల పక్కచూపులు

ప్రజాపక్షం/నెక్కొండ : మొన్నటి వరకు రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన భారత రాష్ట్ర సమితి ఒక్కసారిగా 10 సంవత్సరాల అనంతరం ఓటమి చూసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆ పార్టీ క్యాడర్ చాలా మంది కాంగ్రెస్ పార్టీలోకి వలస వెళ్లారు. అయితే మంగళవారం జరిగిన దేశవ్యాప్త పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో ఆ పార్టీ ఒక్క సీటు కూడా సాధించలేక పోయింది. దీనితో రాబోయే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, వార్డు మెంబర్లు, ఆశించే ఆ పార్టీ శ్రేణులు ఇప్పటి నుండి పావులు కదుపుతూ పక్క పార్టీల్లోకి తొంగి చూస్తున్నారు. కాంగ్రెస్, బిజెపిలలోకి వలసలు వెళ్ళడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలతో బిఆర్ఎస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఉనికి లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది.

## ఇంచార్జ్ ఏపిఎం ఇమామ్‌కు సన్మానం



ప్రజాపక్షం/గణపురం : గణపురం మండలం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఎంపి డాక్టర్ ఇమామ్ ను బుధవారం గణపురం మండల ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నడిగొట్టి రాములు, జిల్లా చైర్మన్ చాగరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని చేల్పూర్ గ్రామానికి చెందిన ఇమామ్ ఆర్ఎంపీ డాక్టర్ గా విధులు నిర్వహిస్తూ మహిళా సంఘంలో వివిధ హోదాలో పనిచేసి ప్రమోషన్ పై ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో తోటి ఆర్ఎంపీలు పీఎంపీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు విద్యాసాగర్, కూతురు రమణ, దౌదు రమేష్, అజ్మత్, ధనంజయ, సంధ్యా, కర్రు రఘుపతి, శశిధర్, శివ, అంజి, ప్రభాకర్, అన్వర్, శ్రీధర్, నగేష్, శంకర్, శ్రీను, యాకూబ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మానుకోట పోలీసులు

## ఎస్పీ సుధీర్‌రాంనాద్‌కేకన్ ఆదేశాలతో..
## ఆ అనాధకు అన్నీ తామై..



**ప్రజాపక్షం/మహబూబాద్ :** పెంచుకున్న అమ్మను కోల్పోయి నిలువనీడలేకుండా నడిరోడ్డు మీద నిలబడ్డ మానస అనే 12సంవత్సరాల బాలిక విషయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ స్పందించిన తీరు చూసిన తర్వాత.. మానవత్వం నిండిన నిలువెత్తురూపం మహబూబాబాద్ పోలీస్ బాస్ రూపంలో మన..మద్యే ఉన్నాడనే నమ్మకం ఏర్పడింది. మానస విషయాన్ని వాట్సాప్ గ్రూప్ లో చూసిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, ఆరోజు వెంటనే కురవి ఎస్ఐ గోపిని బాలిక ఇంటికి పంపించారు. తినడానికి తిండిగింజలు కూడా లేవనే పరిస్థితి తెలుసుకొని, నిమిషాలలో అరక్వింటాబియ్యం, పదిరోజులకు సరిపడా నిత్యవసరసరుకులు అందించారు. రూరల్ సిఐ సర్వయ్య ను పంపించి ఎప్పటికప్పుడు అమ్మాయి యోగక్షేమాలు వాకబు చేసారు. అంతేకాకుండా కురవిలో ఈరోజు సాంప్రదాయబద్దంగా మానస చేత శశిరేఖకు దశదినకర్మ నిర్వహించారు. ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ఆదేశాలతో సుమారు 150మందికి మంచి మాంసహారబోజనాన్ని ఏర్పాటు చేసారు. అనాధ ఇంటికి ఆత్మీయ అతిధులుగా ఊహించని బందువులుగా మానస వద్దకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్ డిఎస్పీ తిరపతిరావు, రూరల్ సిఐ సర్వయ్య, కురవి ఎస్ఐ గోపి వచ్చి శశిరేఖ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పంక్షన్ హాల్ లో బోజనాలను ఏర్పాటు చేసి, వారే స్వయంగా వడ్డించి, ఇష్టపంక్తి బోజనాన్ని నిర్వహించారు. శశిరేఖ మరణవార్తను, మానస దయనీయ పరిస్థితిని వాట్సప్ గ్రూప్ ద్వారా వెలుగులోకి తెచ్చిన మహబూబాబాద్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లాఅద్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ ను కూడా ఈ సందర్భంగా పోలీస్ అధికారులు అభినందించారు. మానవత్వంతో స్పందించి అనాధకు అన్నీ తామై ఆసరాగా నిలిచిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఈ సంఘటన తెలిసిన ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. ఇంతటి చక్కటి మనసున్న మీరు నిండునూరేళ్ళు చల్లంగా బ్రతకాలని, మీ పిల్లాపాపలు హాయిగా ఉండాలని దీవించారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోనీ మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జిట్ట రామచంద్రు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించగా బుధవారం మృతుని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఐరెడ్డి ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బే ట బాబు, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర శ్రీధర్, మండల నాయకులు ఉల్లెంగల యాదగిరి, బీరం వెంకటరెడ్డి, కిసాన్ సేల్ అధ్యక్షులు తుమ్మ భూపాల్ రెడ్డి, నాయకులు గూడెల్లి వెంకటయ్య, చిర్రా సామెల్, చిర్రా యాకయ్య, పిడుగు వేంకన్న, బండ యాదగిరి, సునీల్, రాజు, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయరావు చెరువు కట్ట మీద చెరువు కట్ట సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించి వాటికి శాసరింగ్, ట్రిమ్మింగ్, వీడింగ్ దగ్గరుండి చేపించడం జరిగింది. అలాగే చెరువు కట్టమీద గల గార్డెన్ ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇవ్వడంతొ పాటుగా చెరువుకట్టను పూర్తిగా తిరిగి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వార్డ్ ఆఫీసర్ రాములు, సానిటరీ ఇన్స్పెక్టర్ మురళీ మోహన్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్ గ, మునిసిపల్, హరితహారం సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూమిపై మానవ మనుగడ సజావుగా సాగాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాలని జయశంకర్ భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుండి స్థానిక అంబెద్కర్ చౌరస్తా మీదుగా పర్యావరణ అవగాహన ర్యాలీ సాగింది. జయశంకర్ విగ్రహం నుండి తిరిగి జిల్లా కోర్టు కి చేరింది. ఈ కార్యాక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. యావత్తు ప్రపంచం పర్యావరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న నేటి తరుణంలో ప్రజలంతా మేల్కొని విరివిగా చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాయు కాలుష్యం నిర్మూలించాలని, భూగర్భ జలాలను కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని జడ్జి అన్నారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కే.జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.రామచంద్ర రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేష్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, పోక్సో కోర్టు స్పెషల్ పి.పి.విష్ణువర్ధన్ రావు, అడిషనల్ పి.పి.రఫీక్, న్యాయవాదులు, పోలిసు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**ప్రజాపక్షం/రాయపర్తి :** వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య సాధించడంతో బుధవారం మండలంలోని బురహాన్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సుధూల దేవేందర్ అధ్వర్యంలో పాటకులు కల్చుతూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజారిటీ తో గెలిపించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ భూక్యా జనార్ధన్, మాజీ ఎంపిటిసి ఆటో మల్లేశం, మద్దె బోయిన రాజు, బెల్లి రవి, బాలే రవి, బాలే అంజయ, బాణోత్ వెంకన్న రాములు, వెంకటేష్, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్‌జిమ్ కోసం విరాళం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో ఆరోగ్యమే మహాభాగ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ కొరకై నిజాంపేట మండల జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ తన వంతు సహాయంగా 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. అలాగే గ్రామ వార్డు మెంబర్ ఆముద రాజు11,311 రూపాయలను అందించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో దాతల సహకారంతో ఓపెన్ జిమ్ కొరకై విరాళాలు సేకరించడం జరుగుతుందని. గ్రామంలో గ్రామస్తులందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఓపెన్ జిమ్ కు అహర్నిశలు కృషి చేస్తున్న ఆరోగ్యమే మహాభాగ్యం టీమ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలోఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులు జిపి స్వామి, జీడి తిరుపతి గౌడ్, చీకోటి వెంకటేశం, బట్ట మహేష్, జాల పోచయ్య, గేరిగంటి బాబు, శెనగపల్లి తిరుపతి, వినయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ 13వ వార్షికోత్సవ ఉత్సవాలు



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** ఈ నేల 11, 12 తేదీలలో నర్సాపూర్ పట్టణంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ 13వ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో 13వ వార్షికోత్సవాల పోస్టర్ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రోడ్డులో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ 13వ వార్షికోత్సవ ఉత్సవాలను ఈనెల 11 మంగళవారం 12 బుధవారం రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి పూజ పుణ్యావచనం నవగ్రహ పూజా రుత్విక్వాహనం ద్వజారోహణం వాస్తు గృహ సర్వతోభద్ర మంటపారాధన అగ్ని ప్రతిష్టా జలాభిషేకంతో పాటు మధ్యాహ్నం శ్రీ జమదగ్ని సహిత రేణుకా దేవి కళ్యాణం తీర్థప్రసాద విసరణ అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుధవారం రోజున చండీ హవనము సామూహిక కుంకుమార్చనలు పూర్ణాహుతి మహాదాశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం సాయంత్రం బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ ఉత్సవాలు ఆలయ పూజారి మురళీ కృష్ణ పంతులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నర్సాపూర్ పట్టణంలో జరిగే ఈ శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ ఉత్సవాలకు భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు కాంగ్రెస్ వైపే..
## కావ్య గెలుపే నిదర్శనం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** ఇటీవల జరిగిన వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టి ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆమె ఘన విజయం సాధించడంతో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారనేది నిరూపించారని జిల్లా కాంగ్రెస్ పార్టి మహిళ కార్యదర్శి పోరెడ్డి లక్ష్మి ప్రభాకర్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలు పూర్తి విశ్వాసంతో రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీ అభ్యర్థులను గెలిపించారన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టి నాయకురాలు సోనియాగాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టి అభ్యర్థులను గెలిపించుకునే దిశగా జిల్లా అధినాయకత్వంతో ముందుకెళ్తామని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కొరకు అహర్నిశలు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టి నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరున ఆమె హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కావ్య గెలుపుతో సంబరాలు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** కాంగ్రెస్ పార్టి వరంగల్ ఎంపీ కడియం కావ్య అత్యధిక మెజార్టీ రావడంతో కాంగ్రెస్ పార్టి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాజీ మార్కెట్ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టి నాయకులు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ కొంతమంది ప్రతిపక్షాల నాయకులు కడియం కావ్యను కావాలని వారి కుటుంబాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పార్టి నాయకులు నకల ఐలయ్య, అన్నబోయిన బిక్షపతి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎడ్ల వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కర్ణాకర్ రావు, ఎంపీపీ సుదర్శన్, ఇల్లందుల శ్రీనివాస్, రాజు, చిట్టిమల్ల కృష్ణమూర్తి, మోహన్‌రావు, ఎర్ర సతీష్, కన్నా సోమశేఖర్, పాల్గొన్నారు.



# కాం(గ్రెస్, బిఆర్ఎస్‌ను తిరస్కరించిన మెదక్ ఓటర్లు

## ఎంపిగా రఘునందన్‌రావు ఘనవిజయం

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** బిఆర్ఎస్ కాంగ్రెస్ కు కంచుకోటైనా మెదక్ పార్లమెంట్ స్థానంను కమలం పార్టీ కైవసం చేసుకుంది. 25 ఏళ్ల తర్వాత మెదక్ లోక్ సభ స్థానాన్ని బిజెపి పార్టీ గెలిచి చరిత్ర సృష్టించింది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అంచనాలను తారుమారు చేస్తూ బిజెపి విజయఢంకా మోగించింది. బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండవ స్థానంతో సరిపెట్టుకోగా, మూడవ స్థానంలో బిఆర్ఎస్ పార్టీ నిలిచింది. 2004 నుంచి వరుసగా ఐదు సార్లు మెదక్ ఎంపి స్థానం గెలిచిన బిఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మెదక్ పార్లమెంట్ కు కంచుకోటైనా బిఆర్ఎస్, కాంగ్రెస్ లకు భంగపాటు తప్పలేదు. కంచుకోటను బద్దలు కొడుతూ మెదక్ ప్రజలంతా ఉద్యమకారుడు రఘునందన్ రావు కు పట్టాభిషేకం చేశారు. 1999 ఎన్నికల్లో బిజెపి పార్టీ తరుపున పోటీ చేసి ఆలే నరేంద్ర మెదక్ ఎంపిగా ఎన్నికయ్యారు. అప్పటి వరకు బాగారెడ్డి కి మెదక్ స్థానం పెట్టింది పేరు. ఆలే నరేంద్ర గెలిచి బాగారెడ్డి విజయపరంపరను నిలువరించారు. నాటి నుంచి 2024 ఎన్నికల వరకు బిఆర్ఎస్ హవా కొనసాగింది. మెదక్ గడ్డపై 25 ఏళ్ల తర్వాత కషాయం జెండా ఎగురవేసి రఘునందన్ రావు బిజెపికి చరిత్రాత్మక విజయం అందించారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పై పోటీ చేసి ఓటమిపాలైన బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు కు దుబ్బాక ఉప ఎన్నికల్లో బిజెపి పార్టీ మరో అవకాశం ఇవ్వడంతో దుబ్బాక ఎంఎల్ఏ గా ఎన్నికయ్యారు. తర్వాత 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ లోక్ సభ కు పోటి చేసి ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో రఘునందన్ రావు కు 4,71,217 ఓట్లు పొలయ్యాయి. 39,139 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి మెదక్ పార్లమెంట్ స్థానాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.



## పిల్లుట్లలో పర్యావరణ దినోత్సవం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో బుధవారం భవాని ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో కమ్మర్ క్యాంపులో విధ్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని ఉత్సవ కమిటి అడ్వైజర్ ఉపాధ్యాయులు కమ్మరి నరేందర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతీ ఒక్కరు తమ పుట్టినరోజున ఒక మొక్కను నాటుతూ సంరక్షించేలా పిల్లలకు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ అద్యక్షులు బొంది శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ దాసరి నర్సమ్మదుర్గయ్య, శ్రీధర్‌గౌడ్, బండారి వైష్ణవి, ఈరని కావేరి, దాసరి మానస, మంలపర్తి వర్షిత, పిల్లి భార్గవి, గుల్లయ్యగారి హారిక, విధ్యార్థులు ఉన్నారు.

## మంత్రి పొన్నంను కలసిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నరుకుల శివప్ప మర్యాద పూర్వకంగా కలిసారు. ఆనంతరం శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిద్దిపేటలో వచ్చే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కలసి కట్టుగా కృషిచేయాలన్నారు.



**ఎంపి సురేష్ షెట్కార్‌ను సన్మానించిన శివప్ప**

జహిరాబాద్ పార్లమెంట్ ఎంపిగా విజయం సాధించిన సురేష్ షెట్కార్‌ను సిద్దిపేటమున్సిపల్ మాజీ చైర్మన్ శివప్ప మర్యాపపూర్వకంగా కలిసారు. ఎంపిగా ఎన్నికైన సురేష్‌షెట్కార్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపి షెట్కార్ మాట్లాడుతూ సిద్దిపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కలసికట్టుగా కృషిచేయాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిండ్ల నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాజయ్య

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** విశ్రాంత ఉద్యోగుల సంఘం మహాదేవపూర్ మండల అధ్యక్షులుగా అడప రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.బుధవారం మండలకేంద్రంలోని రామాలయంలో మండల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడిగా అపరాజయ్య,ప్రధాన కార్యదర్శిగా ఠాకూర్ విక్రం సింగ్,కోశాధికారిగా ఆరేందల అంకన్న,గౌరవ అధ్యక్షులుగా సిరిపురం రాజేశ్వర్ రావు,అసోసియోట్ అధ్యక్షులుగా వెలగల సత్యనారాయణ రెడ్డి,ఉపాధ్యక్షులుగా తన్నీరు అంకమ్మ,ఉపాధ్యక్షురాలుగా గొట్టెముక్కుల లక్ష్మి ,సంయుక్త కార్యదర్శిగా బికినూరి లక్ష్మణ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గందెసిరి రామన్న,రవెల్లి శకుంతలమ్మ,ఖుర్షీద్ అహ్మద్,పబ్లిసిటీ కార్యదర్శిగా మెరుగు వెంకటి,గౌరవ కార్యవర్గ సభ్యులుగా వేములవాడ లచ్చులు,గౌసియా బేగం,నెన్నెల వెంకటి,బెజ్జని ముత్యాలు,కన్నూరి ఎల్లయ్య,ఠాకూర్ హరి సింగ్,గోవర్ధన,ఠాకూర్ శంకర్ సింగ్‌లన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అనంతరం సంఘం సభ్యులు అధ్యక్షుడు అడప రాజయ్యను శాలువాతో సత్కరించి సన్మానించారు.అనంతరం అధ్యక్షుడు అడప రాజయ్య మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సంఘం సభ్యులతో కలిసి వారి సలహాలు సూచనల మేరకు ముందుకెళ్తామని అన్నారు.తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇవిఎం గోదాంల భద్రపరిచే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రక్కన ఉన్న ఈవిఎం గోదాంలను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మనుచౌదరి బుధవారం సందర్శించారు. లోకసభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసినందున ఈవిఎం మిషన్లు ఈవిఎం గోదాంలో భద్రపరిచే ప్రకియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవిఎం మిషన్లను పూర్తిగా నియోజక వర్గాల ఏర్పాటు చేసిన గోదాంలను స్ట్రాంగ్ రూంలను జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. సిసి కెమెరా పుటెజీని ఎల్లప్పుడు పనిచేసేలా చెక్ చేసుకోవాలన్నారు. గోదాంల చుట్టు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాని పోలీసు అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ ఎవో అబ్దుల్ రహమాన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## 120 క్వింటన్‌ల పిడిఎస్ బియ్యం పటివేత

**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని చేల్పూర్ ప్రధాన రహదారిపై బుధవారం అక్రమంగా తరలిస్తున్న 120 క్వింటన్ ల పిడిఎస్ బియ్యాన్ని గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి పట్టుకున్నట్లు తెలిపారు. డీసీఎం వాహనంలో పిడిఎస్ బియ్యాన్ని భూపాలపల్లి వైపు తీసుకు వెళ్తుండగా అనుమానం వచ్చి చెక్ చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గమనించి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**ప్రజపక్షం/గణపురం :** ప్రపంచ పర్యావర ణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గణపురం మండలంలోని మైలారం గ్రామం లోని అమృత్ సరోవర్ లో డిఆర్డీఓ నరేష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి పరిరక్ష ణను కాపాడేందుకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. సేద్యంలో రసాయన ఎరువులు,పురుగు మందులు వాడకం అలాగే ప్రజల రవాణా అవసరాలు పెరగడంతో వాహనాలు వినియోగం,చెట్లు తగ్గిపోవడం,వాతావరణ కాలుష్యం వ ల్లవాతావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందువల్ల విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో



మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ పర్యావరణ అనుకూల జీవితం యొక్క ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమాల్లో గణపురం ఎంపీడీవో ఎల్ భాస్కర్ ఈసి రాజు, పంచాయతీ కార్యదర్శి నవీన్, టీఏ లు శ్రావణ్ కుమార్, నవ్య, రాజశ్రీ, ఎఫ్ఏ లు శారద తదితరులు పాల్గొన్నారు.

## ఉపవాసదీక్షతో మొక్కు చెల్లింపు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడంతో సిద్దిపేట అర్బన్ మండలంలోని తడ్కపల్లి గ్రామంలో బిజెపి పార్టీ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షతో కార్యకర్తలు స్థానిక దేవాలయంలో101కొబ్బరికాయలను కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో బిజెపికి అత్యధిక ఓట్లు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని ఇక రాబోయే రోజులు బిజెపి పార్టీయే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక వెంకటేశ్‌గౌడ్,సాంబశివారెడ్డి,సాయి,శ్రీనివాస్,వెంకటేశ్,భానుప్రసాద్,ప్రవీణ్,రవి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** పర్యావరణపరిరక్షణ ప్రతి ఒక్కరి బాద్యతని ఎంపిఓ ప్రసాద్ అన్నారు బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలతకేంద్రంలోని అమృత్సరోవర్ వద్ద మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఉపాధి హామి కూలీలకు అవగాహన కల్పించారు.మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు.దీంతో రాబోయో తరానికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించిన వారమౌతామని అన్నారు.ఈ సందర్భంగా పర్యావరణాన్ని ఎలా కాపాడాలో సూచిస్తూ వారిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏపిఓ రమేష్,ఈసి శ్రీనివాస్,పంచాయతి కార్యదర్శి అంగోత్ సమ్మయ్య,పాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవళిక,సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన విజయంతో పవన్ ఫ్యాన్స్ సంబరాలు



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలంలో బుధవారం తెలంగాణ సెంటర్ లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆంధ్రలో లో 21 కి 21 గాను అసెంబ్లీ 2కు 2గాను పార్లమెంట్ అభ్యర్థుల విజయంతో దేశంలో నే 100కి 100 శాతం విజయం సాధించి దేశ రాజకీయాల్లో సంచలనాత్మక విజయం అందుకున్నందుకు గాను వారి విజయానికి గాను కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నా పవన్ కళ్యాణ్ అసోసియేషన్ ఫ్యాన్స్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్ ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మణ్ కోశాధికారి సునారి కాని చిరంజీవి కన్వీనర్ ప్రవీణ్ ఈ కార్యక్రమంలో పల్లాపు రమేష్, సురేష్, శ్రీశైలం, అర్జున్ ప్రవీణ్, తదితరులు ఫ్యాన్స్ పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న పోలీస్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి పట్టణంలోని సంతలో పోగొట్టుకున్న పర్సును కాటారానికి చెందిన సుంకరి చంద్రకళ గురువారం సంతలో తన పర్సు పోగొట్టుకోగా అక్కడే విధులు నిర్వహిస్తున్న జితేందర్ పోలీస్ కానిస్టేబుల్ సంతలో వెతికి పర్సును కనిపెట్టి ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో బాధితురాలు కు అందజేయడం జరిగింది. ఈ పరుసులో 16,500 రూపాయలు, ఏటీఎం కార్డ్స్ ఆధార్ పాన్ ఇతర విలువైన కార్డ్స్ ఉన్నవి పోగొట్టుకున్న పర్సు అందుకున్న బాధితురాలు పోలీసుల పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేసింది.

# నీలం మధు నైతికంగా విజయం సాధించారు

ప్రజాపక్షం/నర్సాపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు . మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తెర వెనక రాజకీయం చేసి బిజెపి పార్టీతో కుమ్మక్కై బిజెపి అభ్యర్థి రఘునందన్ రావును గెలిపించారని విమర్శించారు. సిద్దిపేట నుంచి బీ ఆర్ ఎస్ అభ్యర్థికి లక్ష మెజారిటీ అందిస్తానని మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటనలు చేసి కేవలం 2 వేల మెజార్టీ అందించడమే అందుకు నిదర్శనమని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి హరీష్ రావులు బిజెపి పార్టీతో రహస్య ఒప్పందం కుదిరించుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేయాలని వారు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 18 వేల భారీ మెజార్టీ అందించడం జరిగిందన్నారు. అందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే వున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నైతికంగా విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, సువాసిని రెడ్డి, శ్రీనివాస గుప్తా, మాజీ ఎంపీపీలు లలిత నర్సింగ్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు మల్లేశం, హాకీం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌడ్, వెంకటేశం, సాగర్ పాల్గొన్నారు.




# ఘనంగా సుధాకర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్ 54వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల మధ్య తోట సుధాకర్ కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు జర్నలిస్టులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి, సీనియర్ నాయకులు గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు గోకారపు శ్యామ్, కె. దుర్గా ప్రసాద్, బొడిగె శ్రీనివాస్, పొడిశెట్టి విష్ణు వర్ధన్, సంపెట సుధాకర్, విజయ్ రాజ్, వీరగోని హరీష్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, శనిగరపు శోభన్ బాబు, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి, భరత్, సంతోష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ జిల్లా కార్యాలయంలో**

సీపీఐ జిల్లా కార్యాలయంలో వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్ జన్మదిన వేడుకలను సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం సుధాకర్‌కు సీపీఐ జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటియూసి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శులు జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




# మానవ మనుగడకు చెట్లే ఆధారం



ప్రజాపక్షం/హసన్‌పర్తి : మానవ మనుగడ కొనసాగాలంటే చెట్లే ఆధారమని డీఆర్‌డీఓ నాగ పద్మజ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సీతంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి హరిత ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ నాగపద్మజ, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నాగపద్మజ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం మానవ ప్రకృతి వ్యతిరేక కార్యకలాపాల వల్ల జల కాలుష్యం, భూమి కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడి మానవుడు జంతువులకు క్యాన్సర్, చర్మ సంబంధమైన వ్యాధులు, కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి సకల జీవరాశులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. మన పూర్వీకులు మనకు అందించి ఆహ్లాదకరమైన ప్రకృతిని మన భవిష్యత్ తరాలకు ఆస్తులుగా అందివ్వడానికి మన వంతు కృషిగా మన భూమిని కాపాడుకోవాలన్నారు. విరివిగా చెట్లను నాటి సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా మొక్కను నాటి నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి బాబు, ఏపీఓ విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంటు సీపీ గొల్లె కల్యాణి, ఫీల్డ్ అసిస్టెంటు తిరుపతి, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన జెడ్‌పిటిసి

ప్రజాపక్షం/లింగాలఘణపురం : మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో భువనగిరి పార్లమెంట్ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఘన విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటుగా జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నేత వంశీకృష్ణ ఉన్నారు.



# ఎంపి కావ్యకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్

ప్రజాపక్షం/హసన్‌పర్తి : వరంగల్ లోక్‌సభ ఫలితాల్లో ప్రతీ రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఆధిక్యత కొనసాగిస్తూ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 2.26 లక్షల అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కడియం కావ్యను హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ గ్రామ మాజీ సర్పంచ్ బండ అమిత జీవన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



# మొక్కలు పెంచి పుడమి తల్లికి పునర్జీవం పోయాలి



ప్రజాపక్షం/లింగాలఘణపురం : మొక్కలు పెంచి పుడమి తల్లికి పునర్జీవం పోయాలని పలువురు తెలిపారు. పూర్వ విద్యార్థుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో లింగాలఘణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించబడి బుధవారం నాటికి 67 వసంతాలు చేరుకుని ఎందరో విద్యావంతులను, మేధావులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చేసింది. కావున పాఠశాల ప్రారంభం రోజు, పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద పార్కులో మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తులను తగ్గించాలని, సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు పెద్దపీటం వేయాలని, కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ కేమిడి బిక్షపతి, ఎడ్ల రాజు, పూర్వ విద్యార్థుల ఐక్యవేదిక ప్రతినిధులు కర్రె వీరన్న, బొద్దు వెంకన్న, వంగ మురళి, రాగల ఉపేందర్, బోయిని రమేష్, ఒడపల్లి శ్రీధర్, పల్లపు కార్తిక్, ఉడుగుల భాగ్య, గట్టగల్ల అనిల్, ఏదునూరి వీరన్న, వంగరాజు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతికార్యకర్తకు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/నర్సాపూర్ : మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి పార్టీ తరపున ఎంపీగా రఘునందన్ రావు గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, రఘువీరా రెడ్డి లు అన్నారు. బుధవారం వారు నర్సాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు డబ్బు, మద్యంతో ప్రలోభ పెట్టిన వారికి లొంగకుండా ప్రజలు బిజెపి అభ్యర్థి రఘునందన్ రావును మెదక్ ఎంపీగా పట్టం కట్టారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీకి చెందిన వార్డు మెంబర్లను, సర్పంచులను, ఎంపీటీసీలు, జడ్పిటిసి లను అత్యధికంగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరవింద్ గౌడ్, శంకర్, బాల్ రాజు, ఎల్లం, నాగేష్, నారాయణరెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిలను కలిసిన బిజెపి నాయకులు





ప్రజాపక్షం/మనోహరాబాద్ : మెదక్, మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ లో ఘన విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు మాధవనేని రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ లను మర్యాదపూర్వకంగా కలిసిన మనోహరాబాద్ మండల బిజెపి నాయకులు బుధవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ లతోపాటు పలువురు బిజెపి నాయకులు రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ లను మర్యాదపూర్వకంగా వారి స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, మహేష్, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వరస్వామి మాస కల్యాణం



ప్రజాపక్షం/పాలకుర్తి : మండల కేంద్రంలోని స్వయంభువు శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం చండిక అమ్మవారి ఆలయంలో చండికా సమేత శ్రీసోమేశ్వర స్వామి వారికి మాస కళ్యాణం, మేళ తాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మహా వైభవోపేతంగా జరిగింది. భక్తులు ఈ కళ్యాణోత్సవంలో పాల్గొని కనులారా తిలకించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి



ప్రజాపక్షం/పాలకుర్తి : ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో ఎ రాములు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలని ఆయన సూచించారు. చెట్లను పెంచడంతోపాటు వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజుల, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర చారి, టిపి కొమురయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పబ్బతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.